విద్యార్థులకు మాస్కుల పంపిణీ

ప్రజాశక్తి -ముంచంగిపుట్టు:ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ, బుడపనస, పరాతపుట్టు తదితర గ్రామాలలో దుప్పట్లు, దోమతెరలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం స్థానిక శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు మాస్క్‌లను రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ వెంగడ లోహితసు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొసైటీ ద్వారా దాతల సహకారంతో రక్త దాన సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొర్ర త్రినాథ్, గిరిజన సంఘం మండలాధ్యక్షులు ఏంఏం శ్రీను, భాస్కర్‌రావు, దీలిప్ కుమార్, మత్స్యరాజు, దొన్ను, ప్రకాష్ పాల్గొన్నారు.

మాస్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

పోస్టు కార్డులతో నిరసన

-ఎమ్మెల్యేలు, కలెక్టర్ల నిలదీత -17వ రోజుకు అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె గురువారం 17వ రోజుకు చేరింది. సమ్మె శిబిరాల్లో అంగన్‌వాడీలు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని పోస్టు కార్డులను సిఎం జగన్‌కు పోస్టు చేశారు.

పాడేరు: తమ సమస్యల పరిష్కారానికై అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు గురువారం పోస్ట్ కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 17వ రోజు కొనసాగింది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా పోస్ట్ కార్డులపై రాష్ట్ర ముఖ్యమంత్రి కి వివరిస్తూ ఉత్తరాలను పోస్ట్ చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఉత్తర్వులు ప్రకారం గ్రాట్యుటి చెల్లింపు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చాలని, పెన్షన్ సౌకర్యంపై ఉత్తరాలు పంపించారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్లు యూనియన్ అల్లూరి జిల్లా కార్యదర్శి వి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారి, అంబిక, లక్ష్మి, సత్యవతి, విజయ, భాగ్యా మరియు కార్మికులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలో అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె గురువారం 18 వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ జంక్షన్ హైవే రోడ్డు వద్ద అంగన్వాడీలు ఒంటికాళ్లతో నిలబడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షురాలు కే.కొండమ్మ, జి.పవిత్ర, అధిక సంఖ్యలో అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:అరకులోయలో అంగన్వాడీలు పోస్టు కార్డులతో నిరసన చేపట్టారు. జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. అంగన్వాడి కనీస వేతనాలు 26 వేలు పెంచాలన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేయాలని, లేకుంటే భవిష్యత్తులో జరిగే పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా అంగన్వాడీ అధ్యక్షురాలు డి.నాగమ్మ, పాంగి వెంకటలక్ష్మి, కొర్రా లక్ష్మి, నిర్మల, రాధాబారతి తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: అంబేద్కర్ కూడలి జంక్షన్ వద్ద అంగన్వాడీలు పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు.అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి గంపరాయి సుశీల మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముందుగా ప్రజాశక్తి అంగన్వాడీ ప్రత్యేక సంచికను సీఐటీయూ జిల్లా ఉపాధ్యకుడు బోండా సన్నిబాబు, మహిళా అధ్యక్షురాలు టి కౌసల్య, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు టి రాజమ్మ, మండల కమిటీ నాయకులు జంపరంగి సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ గంగాధరం ఆవిష్కరించారు. అనంతరం కార్యదర్శి గంపరాయి సుశీల మాట్లాడుతూ, కనీస వేతనాలు 26 వేలు చెల్లించాలన్నారు.అంగన్వాడీ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు చెట్టి పద్మావతి, మంగ, కొండమ్మ పాల్గొన్నారు.

అనంతగిరి:అంగన్వాడీల చేపట్టిన సమ్మె 17వ రోజు కు చేరుకుంది. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.మంజుల, సిహెచ్ కళావతి, ఎస్ సుమిత్ర, సత్యవతి మాట్లాడుతూ, సమస్యలు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.సంగీత, డి. సత్యవతి, వసుంధర, చిలకమ్మ, రాజేశ్వరి, లలిత పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని అంగన్‌వాడీలుి పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్స్ రాములమ్మ, అక్కమ్మ పాల్గొన్నారు

ఎటపాక : అంగన్వాడీలు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా 17వ రోజు గురువారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు రాసి నిరసన తెలియజేశారు. తాడేపల్లి లోని ముఖ్యమంత్రి నివాసం అడ్రస్‌తో పోస్టు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎటపాక ప్రాజెక్టు అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

రంపచోడవరం : అంగన్వాడీ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 17వ రోజు కొనసాగింది. గురువారం పోస్ట్ కార్డులపై తమ న్యాయమైన డిమాండ్ల నెరవేర్చాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఉత్తరాలను రాసి, వాటిని పోస్ట్ బాక్స్‌లో వేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి కె రామలక్ష్మి, నాయకులు సింగారమ్మ, వి.సత్యవేణి, మీడ్డేమీల్స్ కార్మికుల సంఘం నాయకులు మురళి బాపనమ్మ, తుర్రం మయూరి, పద్మ, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ప్రభుత్వం మొండివైఖరి విడనాడి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా అంగన్వాడీలు చేస్తున్న నిరాహార దీక్షలు 17వ రోజు కొనసాగాయి. ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డుల రాసి నిరసన తెలిపారు. ఈ శిబిరాన్ని లోతా రామారావు, సిఐటియు నాయకులు కుంజం జగన్నాథం, పి రామరాజు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.కుమారి, కె.వెంకటలక్ష్మి, రాజేశ్వరి, నూకరత్నం, ఎల్.సత్యవతి, రమణి, మంగ, రాధ, రాజేశ్వరి పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలం కేంద్రం రేఖపల్లి జంక్షన్ అంగన్వాడీలు చేపట్టిన నిరాహార దీక్షలు గురువారం నాటికి 17వ రోజుకు చేరాయి. యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, రాజేశ్వరి, అంగన్వాడి వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

చింతపల్లిలో సిఎం జగన్‌కు పోస్టుకార్డు పంపుతున్న అంగన్‌వాడీలు

ఎమ్మెల్యేలు, కలెక్టర్ల నిలదీత

హుకుంపేటలో ఎమ్మెల్యే, కలెక్టర్‌ను ప్రశ్నిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ప్రారంభానికి వచ్చిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌లను దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు అడ్డగించి తమ సమస్యలు పరిస్కారం చేయాలని నిలదీశారు. సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 26 వేలు, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, అంగన్వాడీ నాయకులు అప్పల కొండమ్మ, కృష్ణవేణి, భాగ్య, వసంత, రాధిక, కృష్ణ కుమారి, విజేత, లక్ష్మీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధనలక్ష్మి అడ్డగింత

చింతూరు : తమ సమస్యలను పరిష్కరించాలని 18 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు గురువారం చింతూరు మండల పర్యటనకు విచ్చేసిన రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మిని ధర్నా శిబిరం వద్ద రోడ్డుపై అడ్డుకున్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేసి, డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముచ్చిక జయమ్మ, వెంకటరమణ, లలిత, కనకదుర్గ, భద్రమ్మ, క్రిష్టమ్మ, రాజకుమారి, దుర్గ, సూర్యకుమారి పాల్గొన్నారు.

చింతూరులో ఎమ్మెల్యే ధనలక్ష్మిని నిలదీస్తున్న అంగన్‌వాడీలు

గృహాల సర్వే వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ సుమిత కుమార్

ప్రజాశక్తి-పాడేరు:ఆదివాసీలకు (పివిటిజిలకు) ప్రధాన మంత్రి జన్ మన్ గృహాలు మంజూరు చేయడానికి సమగ్రమైన సర్వే వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, గృహ నిర్మాణ శాఖ, ఎంపిడిఓలు, ఉపాధి హామీ అధికారులు, ఇంజనీరింగ్ సహాయకులతో గురువారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గృహాలు అవసరమైన పివిటిజి లబ్ధిదారులను గుర్తించి ఆవాస్ ప్లస్ యాప్లో రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డేటా ప్రకారం జిల్లాలో 31,674 పివిటిజి కుటుంబాలు ఉన్నాయని స్పష్టం చేసారు. 2024 జనవరి 5వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని సూచించారు. 10వ తేదీన గృహాలు మంజూరు చేసి, 15వ తేదీన ప్రధాన మంత్రి చేతుల మీదగా గృహాలు శంకుస్థాపనలు చేయడం జరుగుతుందన్నారు. 2026 ఆర్థిక సంవత్సరం వరకు జన్మన్ గృహ నిర్మాణ పథకం కొనసాగుతుందని చెప్పారు. అర్హత కలిగిన పివిటిజిలకు ఇళ్లు మంజూరు చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల 39 వేలు మంజూరు చేస్తుందన్నారు. వీటిలో ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 12 వేలు, ఉపాధి హామీ పథకంలో 90 రోజులు పనిదినాలు చేయడానికి రూ. 27 వేలు విడుదల చేస్తారని అన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు ఉపాధి హామీ జాబ్ కార్డులు మంజూరు చేయాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. సచివాలయం ఇంజనీరింగ్ సహాయకులు, ఉపాధి హామీ టెక్నికల్ సహాయకుల సేవలను గృహనిర్మాణ సర్వే పనులకు వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఏల పిఓలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, కె.చైతన్య, గృహ నిర్మాణశాఖ పథక సంచాలకులు బి.బాబు, డిఇ రాజబాబు, 22 మండలాల ఎంపిడిఓలు, ఉపాధి హామీ ఎపిడిలు, ఎపిఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రాష్ట్రంలో అభివృద్ధి ఏదీ? : టిడిపి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ గ్రామంలో టీడీపి మండల అధ్యక్షులు తులసిరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు ఇన్చార్జి సివేరి దొన్ను దొర తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధిని పక్కనపెట్టి ప్రజాధనాన్ని వృథా చేస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మహిళల కోసం పెద్ద పెట్ట వేసిందని ఆయన గుర్తు చేశారు. గ్రామస్థాయిలో రోడ్లు, తాగునీరు వంటి సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిసిసి చైర్మన్ తులసీరావు, అప్పారావు, గూడా సర్పంచ్ కంబిడి జ్ఞాన్ ప్రకాష్, పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసు బాబు. మాజీ సర్పంచ్ పాడి బాలన్న, అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి శంకర్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దొన్నుదర

మండల పరిషత్ సమావేశం రసాభాస

మిచౌంగ్ తుపాన్ బాధిత రైతులకు నష్ట పరిహారం, అంగన్వాడీల సమస్యలపై నిలదీత

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సిపిఎం, టిడిపి, జనసేన సభ్యులు

ప్రజాశక్తి-కూనవరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభమైన కొద్దీ నిమిషాలకే సీపీఎం, జనసేన, టీడీపీ ప్రజాప్రతినిధులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మిచౌంగ్ తుఫాను దాటికి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వకపోవడం, అంగన్వాడీల సమస్యలు, నర్సింగ్‌పేటలో పిహెచ్‌సి ఏర్పాటు వంటి సమస్యలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సభ్యులు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ పోలవరం పరిహారం ఇచ్చిన భూముల్లో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వొద్దని ప్రభుత్వం జిఒ జారీ చేసిందా అని ప్రశ్నించారు. రైతులకు పెద్ద పీట వేస్తామని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. దీనికి స్పందించిన అధికారులు పోలవరం పరిహారం ఇచ్చిన భూమిలకు పంట నష్టం పరిహారం ఇవ్వరని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో సీపీఎం, జనసేన, టీడీపీ ప్రజా ప్రతినిధులు సమావేశం నుండి బయటకొచ్చి ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ మాట దాట వేయడం దుర్మార్గమన్నారు. ఎన్ని సమస్యలు లేవనెత్తినా అన్నింటికీ ఒకే సమాధానం ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. అధికారులు తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండారు సాంబశివ, కూనవరం సర్పంచ్ హేమంత్, ఎంపీటీసీ అమ్మాజీ, వెంకమ్మ, కో-ఆప్షన్ సభ్యులు షరీఫ్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సంప్రదాయ వైద్య విధానంపై శిక్షణ

ప్రజాశక్తి-చింతూరు

పారంపర్య మహా సంఘం, జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిమ్మలగూడెం ఆఫ్రిన్ ఆయుర్వేద వైద్యశాల ప్రాంగణం సంప్రదాయ వైద్య విధానంపై అవగాహన, ఔషధాల తయారీపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ ప్రొఫెసర్ సురేష్ జకోటియా మాట్లాడుతూ సాంప్రదాయ పారంపర్య వైద్యం నేడు మానవాళికి ఎంతో ఉపయోగపడుతుందని, అల్లోపతి వైద్యానికి లొంగని మొండి రోగాలు సైతం నయం చేస్తుందని చెప్పారు. ఒక మూలిక 100 రకాల జబ్బులను నయం చేస్తుందన్నారు. ఈ వైద్య విజ్ఞానం అంతరించకుండా భవిష్యత్ తరాలకు అందించడానికి ఆయుర్వేద వనమూలిక వైద్యంలో మెలుకవులు నేర్పించాల్సి ఉందని తెలిపారు. ఆయుర్వేద వైద్యులు మొహమ్మద్ గని మాట్లాడుతూ భద్రాచలం అటవీ ప్రాంతంలో ఎంతో విలువైన ఔషధ మొక్కలు ఉన్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ కాపాడి ఆయుర్వేదాన్ని బతికించాలన్నారు. నాటు వైద్యులు ఆనందయ్య, ప్రముఖ వనమూలక వైద్యులు జమాల్ ఖాన్ మాట్లాడారు. అనంతరం రక్త పరీక్ష కేంద్రం, అఫ్రీన్ ఆయుర్వేదిక్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్, మెడికల్ స్టోర్లను జకోటియా, ఆయుర్వేద వైద్యులు ప్రారంభించారు. అనంతరం తెలంగాణ, చత్తీస్‌ఘడ్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన మీడియా ప్రతినిధులను, పలు సంస్థల ప్రతినిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పారంపర్య వైద్య మహా సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్ రాజు, వేణుగోపాలరెడ్డి ప్రసాద్‌రావు, ఎస్.రమేష్, లక్ష్మణ్, ముసద్దిక్, ఖజమస్తాన్, భవాని, అబ్దుల్ జబ్బార్, షేక్ వినాయ, మహమ్మద్ ఖబీర్ ఖాన్, షేక్ సుభాని, జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ ఇమ్రాన్ ఖాన్, ట్రస్ట్ ఇన్‌ఛార్జి సుభాని, ట్రస్ట్ బోర్డు మెంబర్ జావేద్ పాల్గొన్నారు.

ప్రముఖ వన మూలిక వైద్యులు జమాల్ ఖాన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

పాడేరులో ర్యాలీ చేస్తున్న విఆర్ఎలు

ప్రజాశక్తి -పాడేరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల అనుసరిస్తున్న తీరుతో ఆంధ్ర ప్రదేశ్ ఉద్యోగుల ఆందోళనలతో అట్టుడుకుతోందని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. గురువారం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (వీఆర్ఏలు) స్థానిక తహసిల్దార్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఉద్యమాలతో రాష్ట్రం తగలబడుతుంటే కనీసం ముఖ్యమంత్రి స్పందించ లేదని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా సమస్యల పరిష్కారం కాక సతమతమవుతున్న ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకుండా మరోవైపు రాష్ట్రంలో ఆటలాడుదాం అంటూ సమస్యల్ని గాలి కొదిలేస్తుందని విమర్శించారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి వివిధ తరగతులకు వర్గాలకు ఇచ్చి న హామీనే అడుగుతున్నారని గుర్తు చేశారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, పే స్కెలు అమలు, నామిని ఉద్యోగాలకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా డిఆర్‌ఓ రమణకు గ్రామ సేవకుల సంక్షేమ సంఘం సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. జనవరి ఐదు తర్వాత సమ్మెలోకి వెళ్ళనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సుందరరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొండబాబు, శేఖర్, గ్రామ సేవకులు పాల్గొన్నారు.

చింతూరు : గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఎ)కు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పే స్కేల్ విధానం అమలు చేయాలని కోరుతూ చింతూరు ఐటిడిఎ వద్ద గురువారం విఆర్ఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్ఎలు మాట్లాడుతూ 2018 నుండి పెండింగ్లో ఉన్న డిఏ విడుదల చేయాలని, అర్హత ఉన్న విఆర్ఏలకు విఆర్ఒలగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ వీఆర్ఏలు అనేక ఏళ్లగా వెట్టి చాకిరీ చేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారని, రెవెన్యూ కార్యాలయాల వద్ద వీఆర్ఏలపై పని భారం పెరిగిందని, రాత్రి వాచ్‌మెన్ విధులు వీఆర్ఏలు నిర్వహించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలకు కనీస వేతన విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఐటీడీఏ ఏపీవో సుజాతకు వినతి పత్రాన్ని అందించారు. దీనికి స్పందించిన ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు జి రవి, ఎల్ వెంకటేశ్వర్లు, పి సీతారాములు, ఎం ప్రసాద్, పి బాయమ్మ, బి రామచంద్రం, కే ప్రసాద్, పి సీతారాములు పాల్గొన్నారు.

చింతూరు ఐటిడిఎ వద్ద ఎపిఒకు సమస్యలను వివరిస్తున్న విఏఎలు

పోలవరం నిర్వాసితుల మనుగడ ప్రశ్నార్థకం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-ఎటపాక

పోలవరం ప్రాజెక్టు వలన నిర్వాసితులైన వారి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. 'పోలవరం పోరు కేక మహా పాదయాత్ర' వాలంటీర్లకు మండలంలోని కెయన్.పురం గ్రామంలో జరుగుతున్న రెండో రోజు రాజకీయ శిక్షణ తరగతుల్లో మంతెన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పేరుతో నిర్వాసితుల భూములను, వారి ఇండ్లను, వారి జీవితాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాశనం చేశాయన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. లేకుంటే భవిష్యత్తులో నిర్వాసితుల జీవితాలు మరింత దుర్భరంగా మారుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, పార్టీ ఎటపాక మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఐ.పద్మ, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత మంతెన సీతారాం

మాట్లాడుతున్న సిపిఎం జడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

సరిహద్దు గ్రామాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టాలి : గంగరాజు

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలోని వాలసి పంచాయతీ హుకుంపేట మండలం భూర్జ పంచాయతీలో నెలకొన్న సమస్యలు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని స్థానిక జెడ్పిటిసి దిసారి గంగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు కాలినడకన కొండ కోనల మధ్య నుండి కిలోమీటర్ దూరం నడిచి వెళ్లారు. ఆయా గ్రామాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు, రోడ్డు, తాగునీటి సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూర్జ పంచాయతీ చొంటరిపాడు, సల్తంగి, సుల్లిపకన్ గ్రామల మీదుగా అనంతగిరి మండలం వాలసి పంచాయతీ వాలసిలో 4 కిల్లోమీటర్ల లింకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వాలసి నుండి 4 కిల్లోమీటర్ల ఘాటి నడక దారి మీదుగా నిత్యావసరాలకు గిరిజనులు రవాణా చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.రోడ్డు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎగువశోభ మాజీ సర్పంచ్ పాంగి రవీంద్ర, గిరిజన సంఘం నాయకుడు నరాజీ సురేష్ బాబు పాల్గొన్నారు

విద్యార్థికి ప్రశంసాపత్రం అందిస్తున్న కళాశాల సిబ్బంది

సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-అరకులోయరూరల్: ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించిన అథ్లెటిక్స్ లాంగ్ జంప్ పోటీల్లో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి టి.గోపాలకృష్ణ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు .ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి అథ్లెటిక్స్ లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పేరు తీసుకొచ్చారన్నారు. ఈనెల 29 నుంచి జనవరి 2024 ఒకటి తేదీల్లో తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు.గెలుపొందిన క్రీడాకారుడని కళాశాల స్పోర్ట్స్ ఇన్చార్జి పి నాగబాబు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.అప్పారావు, ఎన్ఎస్ఎస్ పిఓలు వై విజయలక్ష్మి, విద్యార్థులు అభినందించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా సర్వశిక్షా అభియాన్ సాక్షర భారత్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు పలువురు మద్దతు తెలిపారు. సమ్మెలో భాగంగా ఉద్యోగులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో.సురేంద్ర, అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు, ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ రఘువర్మ, ఏపిటిఎఫ్ మహిళా అధ్యక్షురాలు గిడ్డి వరలక్ష్మి, జనసేన నాయకుడు ఒంపూరి గంగులయ్య తదితరులు సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, జిల్లాలో సమగ్ర సర్వశిక్షా అభియాన్ టీచింగ్, నాన్ టీచింగ్ 18 రకాల పనులలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 965 మంది సమ్మె చేస్తూ 9 రోజులు గడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందంచలేదన్నారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, హెచ్.ఆర్.పాలసి అమలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చేయాలని డిమాండ్ చేశారు. 10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాడ్యుటి కల్పించాలని సామాజిక భద్రత పథకాలు ఈపీఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై జిల్లా పరిషత్ సమావేశం, పాడేరు పాలక వర్గం సమావేశాల్లో తీర్మానం పెట్టాలని డిమాండ్ చేస్తాననన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు

సమ్మెలో భాగంగా దీక్షలో కూర్చున్న ఉద్యోగులు

స్వయం ఉపాధి, పంట రుణాలు మంజూరు చేయండి

జిల్లా కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో స్వయం ఉపాధి, పంట రుణాలను మంజూరు చేసి పేద ప్రజలను, రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, పిఎంఇజిపి కింద స్వయం ఉపాధి కొరకు చేసుకున్న దరఖాస్తులలో 55 మందికి మాత్రమే రుణాలు మంజూరు అయ్యాయని, ఇంకా రెండు వందల పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున, వారికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యతా రంగాలకు కూడా రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇప్పటివరకు 35శాతం మేర రుణాలు మంజూరు చేసారని, మిగిలిన వారికి కూడా ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యంగా కాఫీ, మిరియాల రైతులకు దళారుల బెడద లేకుండా, ఇతర సమస్యలకు గురి కాకుండా వారికి వీలైనంత ఎక్కువ రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి నాబార్డ్ వార్షిక రుణ ప్రణాలికను కలెక్టర్ విడుదల చేసారు. ప్రాధాన్యతా రంగాలకు అన్ని అంశాలలో కలిపి రూ.2,459 కోట్ల రుణ ప్రణాళికను నాబార్డ్ సిద్ధం చేయగా, కలెక్టర్ అంగీకరిస్తూ ఆయా లక్ష్యాలను బ్యాంకర్లు చేరుకోవాలని, సకాలంలో రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎల్‌డిఎం బి.రవితేజ, డిఆర్డిఏ పిడి వి. మురళి, పారిశ్రామిక శాఖ ఎడి నవీన్ కుమార్, ఆర్‌బిఐ ప్రతినిధి నాగ ప్రవీణ్, నాబార్డ్ డిడిఎం జి ఆర్. శమంత కుమార్, ఎస్బిఐ, యుబిఐ, ఎపిజివిబి బ్యాంకుల ప్రాంతీయ మేనేజర్లు ఐ.ఫణి కొండల రావు, పి.నరేష్, పి.చిరంజీవి వెంకటేష్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -హుకుంపేట:-మండల కేంద్రంలోని నూతన తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐటిడిఏ పిఓ అభిషేక్ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ పాల్గొని గురువారం నూతన తహసిల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవం చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మరింత సేవలు అందుబాటులో ఉంటూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ప్రజలకు సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో జిల్లా కలెక్టర్ ఐటిడిఏ నిధులతో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కార్యాలయంలో ప్రభుత్వ సేవలు పొందుకోవడానికి వచ్చిన ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందించాలన్నారు. అనంతరం అరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో హయంలో గ్రాంట్ అయిన భవనాన్ని ఎన్నో ఏళ్లగా ప్రారంభానికి నచ్చుకోలేక సగం పనులు చేపట్టి మధ్యలో ఆపివేశారన్నారు. వైయస్ఆర్ ప్రభుత్వంలో కొంత నిధులు ఏర్పాటు చేసి నిర్మించడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో టీచర్స్ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఆకులపాటి రఘువర్మ, తహసిల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీపీ కూడా రాజబాబు. స్థానిక సర్పంచులు ఎంపిటిసిలు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

ఆందోళన చేస్తున్న మహిళలు

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని మారు మూల పెద్దకోట పంచాయతీ పరిధి తోంకోట గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. జల్జీవన్ మంచినీటి పథకం తక్షణమే మంజూరు చేయాలని తాగునీటీ సమస్య పరిష్కరించాలని పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కె.ఈశ్వరరావు, పి. వెంకటరావులు మాట్లాడుతూ, తమ గ్రామంలో 30 కుటుంబాలు 170 జనాభా నివసిస్తున్నామని కనీసం మంచినీటి లేక కొండ వాగు నుండి తీసుకొస్తున్నామన్నారు. కలుషితమైన ఊట నీటిని ఆశ్రయించడం జరుగుతుందని, దీంతో అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. జనవరి 7న భారీ పండుగ మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని, ఆంధ్ర ఒరిస్సా రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారని తాగునీటి సమస్యతో భక్తులకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పలుచోట్ల క్రీడా పోటీలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: జగనన్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో సచివాలయ అధికారుల ఆధ్వర్యంలో షటిల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మూడు జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి ఎంతో దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది లక్ష్మణ్, క్రీడాకారులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

పెదబయలు : అడుదాం ఆంధ్రలో భాగంగా రెసిడెన్సియల్ కళాశాలలో క్రీడా పోటీలు జరిగాయి. క్రీడాకారులకు ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదు.

నేడు స్పందన

ప్రజాశక్తి-పాడేరు:జిల్లాలో జరుగనున్న జగనన్నకు చెబుదాం స్పందన ప్రత్యేక కార్యక్రమం ఈనెల 29న శుక్రవారం పాడేరు ఐటిడిఎ సమావేశ మందిరంలో జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం అనివార్య కారణాలతో స్పందన రద్దయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం పాడేరు లో జరుగనున్న స్పందనకు ప్రజలు హాజరై వారి సమస్యలను ఫిర్యాదు రూపంలో అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులందరూ ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

చెడు వ్యసనాల నుంచి విముక్తి కావాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : యువత మాదకద్రవ్యాలు, మద్యపానం, అశ్లీలం, జూదం వంటి చెడు వ్యసనాలకు విముక్తి పలకాలని ఐడియల్ యూత్ మూమెంట్ రాష్ట్ర అధ్యక్షులు కలీముల్లా ఖాన్ కోరారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో 'మరలి రాదు ఈ జీవితం' మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గీతం విద్యార్థులకు మేథో సహకారం

- డెన్మార్క్ నిపుణుడు ప్రొఫెసర్ రాఘవ

ప్రొఫెసర్ రాఘవ ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ: గీతం విశ్వవిద్యాలయం విద్యార్థులకు మేధో సహకారాన్ని అందస్తామని డెన్మార్క్‌లోని ప్రసిద్ధ కోపెన్‌హాగెన్ బిజినెస్ స్కూలుకు చెందిన సెంటర్ ఫర్ బిజినెస్ డేటా ఎనలిటిక్స్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎమ్.రాఘవ భరోసానిచ్చారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఏర్పాటుచేసిన సదస్సులో మాట్లాడుతూ, డీప్ లెర్నింగ్ మెథడ్స్‌పై ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ విజయశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులలో నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి నిపుణుల ప్రసంగాలు దోహదపడతాయని, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

మార్చి 24 నుంచి 'ఓపెన్' టెన్త్ ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : 2024 విద్యాసంవత్సరానికి సంబంధించి సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్ పరీక్షలను మార్చి 18 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్టు డిఇఒ ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ మార్చి 30 నుంచి ఏప్రిల్ 4 వరకు, రెండు పూటలా ఉంటాయన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును జనవరి 5 నుంచి 19 వరకు చెల్లించవచ్చున్నారు. రూ 25లు అపరాధ రుసుంతో జనవరి 20 నుంచి 27 వరకు, రూ 50లు అపరాధ రుసుంతో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3 వరకు చెల్లించవచ్చున్నారు.

కూలి రేట్లు పెంచాలని కళాసీల ధర్నా

ప్రజాశక్తి -సీతమ్మధార : కూలిరేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ నగరంలో శంకరమఠం రోడ్‌లోని ప్లేవుడ్ షాపుల వద్ద లోడింగ్ అన్‌లోడింగ్ పనులు చేస్తున్న కళాసీలు గురువారం ధర్నా చేపట్టారు. సిఐటియు, ఎఐటియుసి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎగుమతి, దిగుమతి కూలి రెట్లు పెంపుపై తక్షణమే అగ్రిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించిన మెరుపు ధర్నా సిఐటియు, ఎఐటియుసి ముఠా కార్మిక సంఘ నాయకులు ఎం .సుబ్బారావు, ఎం. మన్మథరావు మాట్లాడుతూ, కళాసీలకు ప్రస్తుతం చెల్లిస్తున్న కూలీ రేట్లు ఎటూ సరిపోవని, రెండేళ్లుగా కళాసీల రేట్లు పెంచకుండా యజమానులు మొండిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా షాపుల యజమానులు కళాసీల కూలీలపై తాజా ఒప్పందం కుదుర్చుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు.స్పందించకుంటే పనుల బంద్‌కు వెనకాడబోమని హెచ్చరించారు.

ధర్నా చేస్తున్న కళాసీలు

సకాలంలో వైద్యం అందక గిరిజనుడి మృత్యువాత

వైద్యాధికారి నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
దారకొండ పిహెచ్‌సి ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-సీలేరు :కాలికి గాయమై, షుగర్ వ్యాధి కారణంగా ఇన్ఫెక్షన్ అయిన రోగికి సకాలంలో వైద్యం అందకపోవడంతో మృత్యువాత చెందిన సంఘటన జికె.వీధి మండలం దారకొండ పిహెచ్‌సి పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి నాగభూషణం నిర్లక్ష్యం కారణంగా మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. మృతుని బంధువులు, గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ బాబురావు తెలిపిన వివరాలు ప్రకారం...

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి తోకరాయి గ్రామానికి చెందిన కిముడు వెంకటరావు (55)కు కొద్ది రోజుల క్రితం కాలికి గాయమైంది. నాడు వైద్య సేవలు పొందారు. అయితే షుగర్ వ్యాధి ఉన్న వెంకటరావుకు బుధవారం ఉదయం తీవ్ర రక్తస్రావం జరుగుతుండగా 7 గంటల సమయంలో దారకొండ పిహెచ్‌సికి బంధువులు తీసుకొచ్చారు. వైద్యాధికారి నాగభూషణం, ఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలు అందించకపోగా, బాధితుడిని ఆస్పత్రి లోపలికి తీసుకురావద్దు బయటే ఉంచాలని, చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి బస్సులో తీసుకుపోవాలని వెంకట్రావు బంధువులపై పెద్దపెద్ద కేకలు వేశారు. అంబులెన్స్ ఏర్పాటు చేస్తే చింతపల్లి తరలిస్తామని చెప్పినా వారి మాట పట్టించుకోలేదు. ఉదయం 11 గంటల వరకు ఆసుపత్రి బయటే వెంకటరావును ఉంచారు. గత్యంతరం లేక జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వైద్య అధికారి అంబులెన్స్ ఏర్పాటు చేశారు. వెంకట్రావును అంబులెన్స్‌లో చింతపల్లి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యంలో మృతి చెందారు.

దీంతో గురువారం మృతుని బంధువులు దారకొండ పిహెచ్‌సి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బాబురావు, మృతుని బంధువులు మాట్లాడుతూ వైద్యాధికారి సకాలంలో అంబులెన్స్ ఏర్పాటు చేసి చింతపల్లి ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టి ఉంటే వెంకటరావు బతికి ఉండేవాడని వాపోయారు. వైద్యాధికారి నాగభూషణంపై తక్షణమే ఐటిడిఏ పిఒ అభిషేక్, కలెక్టర్ సుమిత్ కుమార్ చర్యలు తీసుకోవాలని, లేకుంటే పిహెచ్‌సి ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దారకొండ పిహెచ్‌సి ముందు ఆందోళన చేస్తున్న మృతునిబంధువులు

మృతుడు వెంకటరావు.

వైద్యాధికారి వివరణ

ఈ సంఘటనపై దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి నాగభూషణంను ప్రజాశక్తి వివరణ కోరగా... వెంకటరావుకు కొన్ని రోజుల క్రితమే కాలుకు గాయమైందని, అప్పట్లో దారకొండ పిహెచ్‌సికి రాగా, వైద్యాధికారి హిమబిందు వైద్య సేవలు అందించారని తెలిపారు. తరువాత వైద్య సేవలు పొందడంలో వెంకటరావు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు షుగర్ కూడా ఉండడంతో కాలుకు ఇన్ఫెక్షన్ అయి సెప్టిక్‌గా మారిపోయిందని చెప్పారు. బుధవారం ధారకొండ పిహెచ్‌సికి వెంకట్రావును తీసుకొని రాగా మెరుగైన సేవలు నిమిత్తం అంబులెన్స్‌లో చింతపల్లి ఆసుపత్రికి తరలించడానికి ఒక గంటపాటు ఉంటే మరో పేషెంట్‌తో పాటు ఇద్దరినీ పంపిస్తామని చెప్పామని పేర్కొన్నారు. వెంకట్రావు బంధువులు ఆరోపణల్లో వాస్తవం లేదని వైద్యాధికారి నాగభూషణం వెల్లడించారు.

బడి బస్సుల భద్రతపై దృష్టి

ప్రజాశక్తి -మాధవధార : పాఠశాలలు, కాలేజీల బస్‌లు, ఆటోల అనుమతులు, వాటి నిర్వహణ, భద్రతపై రవాణాశాఖ అధికారులు దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం ఆదేశించారు. గురువారం మాధవధారలోని రవాణాశాఖ కార్యాలయంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జిసి.రాజరత్నం ఆధ్వర్యాన రవాణా, విద్య, స్త్రీశిశుసంక్షేమ శాఖల అధికారులతో స్కూళ్లు, కాలేజీ బస్‌లు, ఆటోలు నిర్వహణలో భద్రతాచర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ అప్పారావు మాట్లాడుతూ, జిల్లాలో పాఠశాలలు, కాలేజీలకు ఎన్ని బస్‌లు, ఆటోలకు అనుమతినిచ్చారు, వాటి నిర్వహణ, సామర్థ్యం, 1098 చైల్డ్ లైన్, పోలీసు టోల్ ఫ్రీ నెంబర్లను వాహనాల్లో స్పష్టంగా ప్రదర్శిస్తున్నారా, బస్‌ల్లో అగ్నిప్రమాద నివారణచర్యలు, ఇతరత్రా అన్ని వివరాలపై ఆరా తీశారు. ఏవైనా లోపాలుంటే తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు. సురక్షిత ప్రయాణమే కమిషన్ ధ్యేయమని, విఘాతం కలిగిస్తే apscpcr2018@gmail.com దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు.

డిటిసి రాజారత్నం మాట్లాడుతూ, కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత అన్నిశాఖల సమన్వయంతో విద్యాలయాల యాజమాన్యాలు, బస్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. సమీక్షలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యురాలు ఎం. రజని, ట్రాఫిక్ సిఐ మళ్ళ అప్పారావు, గోపాలపట్నం ఎంఇఒ డి.దివాకర్, జిల్లా బాలల సంరక్షణ విభాగం పిఒఎస్. ఐ.సి.మమత, రవాణా శాఖాధికారులు ఆర్‌సిహెచ్.శ్రీనివాస్, ఐ.మాధవి, ఎస్.శిరీషాదేవి, ఎం.బుచ్చిరాజు, జి.సత్యంనాయుడు, ఎఎస్.గణేష్ రెడ్డి పాల్గొన్నారు

సమీక్షలో మాట్లాడుతున్న బాలల హక్కుల చైర్మన్ అప్పారావు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రజాశక్తి -సీలేరు : రాష్ట్రంలో వైసిపి పాలనలో ఎక్కడా అభివృద్ధి జాడలేదని పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆరోపించారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని జీకే వీధి మండలం లక్కవరపు పంచాయితీలో టిడిపి మండల అధ్యక్షులు ముక్కల మహేష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఈశ్వరి మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనను అంతమందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వం దాచుకోవడం దోచుకోవడం తప్ప అభివృద్ధి జాడలేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో జీవో నెంబర్ 3 పునరుద్ధరణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

- రూ.2 లక్షల ఆస్తి నష్టం

అగ్నిప్రమాదంలో దగ్ధమైన తాటాకిల్లు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి గ్రామంలో గురువారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. లాగరాయి గ్రామంలోని నిరుపేద గిరిజనులైన పొట్టబోయిన మారయ్య, పొట్టబోయిన పండుకు చెందిన తాటాకిల్లు పొయ్యి నుండి నిప్పు రవ్వలు ఎగిసిపడి రెండు ఇళ్ల పూర్తిగా దగ్ధమయ్యాయి, ఈ అగ్ని ప్రమాదంలో బాధితులకు చెందిన బట్టలు, సామాగ్రి, బియ్యం, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయే రోడ్డున పడిన బాధిత కుటుంబానికి స్థానిక ఎస్సై ఎస్ వెంకయ్య, లాగరాయ్ సర్పంచ్ మిర్యాల ఘనలక్ష్మి, ఆదివాసీ నేత వంతు బాలకృష్ణ గ్రామస్తులు రెవెన్యూ సిబ్బంది నిత్యవసర సరుకులు రగ్గులు, ఇతర వస్తువులు అందజేశారు.

50 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట చెరకు కాటా వద్ద ఆటోలో తరలిస్తున్న 50 కిలోల గంజాయిని పట్టుకొని ముగ్గురిని అరెస్టు చేసినట్లు కేడిపేట ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. గంజాయి రవాణాలో ప్రధాన నిండితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పాతకృష్ణాదేవిపేటకు చెందిన కొయ్య సతీష్ , గజ్జి సాయి, వంకల ప్రసాద్‌లను అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించామన్నారు. నిందితుల నుంచి సెల్‌ఫోన్, ఆటో సీజ్ చేసినట్లు తెలిపారు.